ప్రజాశక్తి

ఆదివారం 20 నవంబర్ 2022 5 అనంతపురం

ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాస్

డివైడ్‌ను ఢీకొని నుజ్జునుజ్జు అయిన కారు ముందు భాగం

ఘోర రోడ్డు ప్రమాదం

◆ పర్వతదేవరపల్లి వద్ద డివైడర్‌ను ఢీకొన్న కారు

◆ ముగ్గురు మృతి ◆ ఇద్దరికి గాయాలు

కనగానపల్లి మండలం పర్వతదేవరపల్లి జాతీయ రహదారిపై శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. డివైడర్‌ను కారు ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు మరణించారు. ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. మృతులు, గాయపడిన వారంతా తెలంగాణ రాష్ట్రం వరంగల్‌కు చెందిన ఒకే కుటుంబానికి చెందిన వారు కావడం విచారకరం.

వార్త మెయిన్‌లో..

పెరుగుతున్న పచ్చదనం

◆ పదేళ్ల ప్రణాళికకు రూపకల్పన ◆ కంపా నిధుల్లో ఈ ఏడాది కోత

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రకృతి అనుకూలత, సంరక్షణకు అటవీ శాఖ తీసుకుంటున్న చర్యలతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో పచ్చదనం పెరుగుదల కనిపిస్తోంది. ఫారెస్టు సర్వే ఆఫ్ ఇండియా ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి శాటిలైట్ ద్వారా పచ్చదనం ఏ మేరకున్నది అన్న వివరాలను తీసుంటూ ఉంటుంది. ఇందులో చూసినప్పుడు జిల్లాలో 2015-17 కాలంలో పచ్చదనం పెరుగుదల కనిపించినట్టు అనంతపురం జిల్లా ఫారెస్టు అధికారి సందీప్ కృపాకర్ గుండాల తెలిపారు. స్క్రబ్ అటవీ ప్రాంతం 1111హెక్టార్లు పచ్చదనం పెరిగినట్టు గుర్తించారు. అదే ఓపెన్ అటవీ ప్రాంతంలో 774 హెక్టార్లు పెరిగినట్టు శాటిలైట్ ద్వారా గుర్తించినట్టు ఆయన వివరించారు. అయితే ఆ తరువాత 2017-19 సంవత్సరాల్లో ఒక్క శాతం మాత్రమే పెరుగుదల ఉన్నట్టు తెలిపారు. అది కూడా కొత్త అటవీ ప్రాంతంలో అభివృద్ధి చేసే క్రమంలో పెరుగుదల పెద్దగా లేకపోవడానికి కారణమని, రాబోయే రెండేళ్ల రిపోర్టు 2019-21 నివేదికలో మరింత పెరిగే అవకాశముండొచ్చని చెప్పారు. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో అటవీ సంరక్షణ చర్యలతోపాటు, పెరుగుతున్న ఉద్యానవన పంటలు పచ్చదనం పెరుగుదలకు కారణాలుగా అటవీ శాఖ అధికారులు భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తంగా రెండు లక్షల హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఇందులో అనంతపురం జిల్లాలో తక్కువగా 73 వేల హెక్టార్లలో విస్తరించి ఉంది. సత్యసాయి జిల్లాలో 1.24 లక్షల వరకు విస్తరించి ఉంది. ఈ ప్రాంతాల్లో అత్యధికంగా ఓపెన్ ఫారెస్టుయే అధికంగా ఉంటుంది. ఇందులో అటవీ ప్రాంతం పెంచేందుకు ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం 'కంపా' కింద నిధులను కేటాయిస్తుంది. ఈ నిధులను ద్వారా స్క్రబ్, ఓపెన్ ఫారెస్టులను అభివృద్ధి చేయడం జరుగుతుంది.

కంపా నిధులు ఈ ఏడాది కోత

కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది కంపా కింద నిధుల కేటాయింపుల్లో కోతలను విధించింది. ఏడాది ప్రణాళిక సమయంలో మొదట రూ.11. కోట్లకు ప్రతిపాదనలను పంపించారు. సుమారు 400 హెక్టార్లలో అటవీ ప్రాంతం అభివృద్ధి చేయాలని ప్రణాళిక రూపొందించారు. అయితే మొదట ఐదు కోట్ల నిధులు మాత్రమే కేటాయించింది. అందులోనూ సగమే విడుదల చేసి నిలిపివేసింది. పూర్తి స్థాయి నిధులు విడుదల చేసి ఉంటే జనవరి నుంచి మార్చిలోపు కొత్త ప్రణాళిక ప్రకారం అటవీ అభివృద్ధికి అవసరమైన చర్యలను చేపట్టాల్సి ఉంటుంది. నిధులు కేటాయించకపోవడం వల్ల వచ్చే ఏడాది చేపట్టాల్సిన ఉంటుంది. నిధులలేమితో ఆగిపోయే పరిస్థితి ఉంది.

వచ్చే పదేళ్ల ప్రణాళిక రూపకల్పన

ప్రతి పదేళ్లకు ఒకసారి జిల్లాలో చేపట్టబోయే అటవీ సంరక్షణ ప్రణాళికను రూపొందిస్తారు. దానికి అనుగుణంగా రాబోయే రోజుల్లో చర్యలుంటాయి. గడిచిన పదేళ్ల ప్రణాళిక ముగియనుంది. దీంతో రాబోయే పదేళ్ల ప్రణాళిక రూపకల్పను చేస్తున్నారు. రాబోయే పది రోజుల్లోపు ఇది పూర్తికానుంది.

జిల్లా కోర్టు విభజనకు సహకరించండి

కలెక్టర్లను కోరిన జిల్లా జడ్జి జి.శ్రీనివాస్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లా కోర్టు విభజనకు సహకరించాలని ఉమ్మడి అనంత జిల్లాల కలెక్టర్లను అనంతపురం ప్రిన్సిపల్ జిల్లా జడ్జి జి.శ్రీనివాస్ కోరారు. శనివారం స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలోని తన ఛాంబర్‌లో రెండు జిల్లాల కలెక్టర్లు ఎస్.నాగలక్ష్మి, బసంత్ కుమార్, ఎస్పీలు డా॥ఫక్కీరప్ప, రాహుల్ దేవ్ సింగ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రాల్లో అన్ని రకాల న్యాయ సేవలు ఒకే చోట పొందేలా జ్యుడీషియల్ కాంప్లెక్సుల నిర్మాణాలు ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు. ఇందుకు సంబంధించి భవనాల నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ చేపట్టాలన్నారు. స్థల సేకరణలో ఆలస్యానికి కారణమవుతున్న భూవివాదాలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. జిల్లాలో పట్టుబడిన మాదక ద్రవ్యాలను సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం భద్రపరచాలని ఎస్పీలను ఆదేశించారు.

అడ్వొకేట్ క్లర్కులకు ఇళ్ల పట్టాలు అందించేందుకు కృషి చేస్తాం :కలెక్టర్

ఇళ్ల పట్టాలకు అర్హత కలిగిన అడ్వొకేట్ క్లర్కులు దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. ప్రిన్సిపల్ జిల్లా జడ్జి నిర్వహించిన సమావేశానికి హాజరైన జిల్లా కలెక్టర్‌ను అడ్వొకేట్ క్లర్కులు, జిల్లా కోర్టు ఉద్యోగులు కలిసి తమకు ఇళ్ల పట్టాలు, స్థలాలు మంజూరు చేయాలని కోరారు. వారి అర్జీలు స్వీకరించి అడ్వొకేట్ క్లర్కులు అందరికీ ఒకే చోట ఇళ్ల పట్టాలు అందించేలా చూస్తామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. గతంలోలాగా జిల్లా కోర్టు ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే అవకాశాన్ని పరిశీలిస్తామన్నారు.

మహాసభల పోస్టర్లను విడుదల చేస్తున్న కెవిపిఎస్ నాయకులు

23, 24న కెవిపిఎస్ జిల్లా మహాసభలు

కరపత్రాలు ఆవిష్కరించిన రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కెవిపిఎస్) 6వ జిల్లా మహాసభలు ఈ నెల 23, 24వ తేదీల్లో గుంతకల్లులో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను శనివారం నాడు కెవిపిఎస్ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక పోరాటాలు చేయడం వల్ల డప్పు, ఉరుము కళాకారులు, చర్మకారులలకు పింఛన్లు అందాయన్నారు. దళితులపై జరుగుతున్న దాడులు, అకృత్యాలు, హత్యలకు నిరసనగా కెవిపిఎస్ ఇతర దళిత సంఘాలు కలుపుకుని ఐక్య ఉద్యమాలు చేసిందని గుర్తుచేశారు. వివక్షతపై ప్రత్యక్ష పోరాటాలను కెవిపిఎస్ నిర్వహిందన్నారు. వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం దళితుల సంక్షేమ ప్రభుత్వం అంటూనే సంక్షేమ పథకాలన్నింటిలోనూ కోతలు విధించిందన్నారు. ఆ పథకాలు తిరిగి సాధించుకోవడం కోసం ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా 23, 24వ తేదీల్లో నిర్వహించే కెవిపిఎస్ మహాసభల్లో భవిష్యత్ పోరాటాలు కార్యచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. కెవిపిఎస్ నాయకులు, కార్యకర్తలు మహాసభల్లో పాల్గొని జయప్రం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నగర అధ్యక్ష, కార్యదర్శులు అక్కులప్ప, జి.వెంకటేష్, ఎర్రిస్వామి, నల్లప్ప, లక్ష్మణ్, నరసింహులు, శివ పాల్గొన్నారు.

ఫ్యాక్షన్‌తో జీవితాలు నాశనం

◆ కావేరిసముద్రం అన్ని గ్రామాలకు ఆదర్శం ◆ రాష్ట్ర మానవహక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ సీతారామమూర్తి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

ఫ్యాక్షన్‌తో జీవితాలు, కుటుంబాలు నాశనం అవుతాయని దీనిని గుర్తించి అలాంటి వాతవరణం నుంచి బయటపడిన తాడిపత్రి మండలం కావేరిసముద్రం గ్రామం ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర మానవహక్కుల కమిషన్ ఛైర్‌పర్సన్ జస్టిస్ సీతారామమూర్తి తెలియజేశారు. శనివారం నాడు ఆయన తాడిపత్రి మండలంలోని భోగసముద్రం, కావేరిసముద్రం గ్రామాల్లో పర్యటించారు. కావేరిసముద్రం ఎంపియుపి పాఠశాలను తనిఖీ చేసి పిల్లలకు, విద్యాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామస్తులను ఉద్దేశించి

మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్ర మానవహక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ సీతారామమూర్తి

మాట్లాడారు. రాయలసీమలో మానవ హక్కులను హరించడంలో ప్రధాన పాత్ర పోషించిన 'ఫ్యాక్షన్'ను ప్రజలంతా మంచి మనసుతో ముందుకొచ్చి రూపుమాపాలని కోరారు. ఫ్యాక్షన్ లేని గ్రామాలు చూడాలంటే శాంతి కోరుకునే మనస్తత్వంతో పాటూ నిబద్ధతతో పనిచేసే అధికారుల సహకారం అవసరం అన్నారు. మానవ హక్కుల కమిషన్ విధులు, కమిషన్ ను సంప్రదించే విధానాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇక విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మానవహక్కుల కమిషన్ సభ్యుడు శ్రీనివాసరావు, తహసీల్దార్ మునివేలుతో పాటు వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అధ్యాపకురాలితో మాట్లాడుతున్న పుణ్యవతి

అధ్యాపకురాలిపై దాడి దుర్మార్గం

◆ నిందితునిపై కఠిన చర్యలు తీసుకోవాలి

◆ ఐద్వా జాతీయ నాయకురాలు ఎస్.పుణ్యవతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో అధ్యాపకురాలు సుమంగళిపై కత్తితో దాడి చేసిన ఘటన అత్యంత విచాకరం అని, దీనికి కారకుడైన ఆమె భర్తపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా జాతీయ నాయకురాలు ఎస్.పుణ్యవతి డిమాండ్ చేశారు. ఇటీవల భర్త చేతిలో తీవ్రంగా గాయపడి అనంతపురం ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతున్న అధ్యాపకురాలిని ఐద్వా నాయకులు శనివారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం పుణ్యవతి విలేకరులతో మాట్లాడారు. దేశం, రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కుటుంబ సమస్యల నేపథ్యంలో సుమంగళిపై ఆమె భర్త హత్య ప్రయత్నం చేయడం దుర్మార్గంగా ఉందన్నారు. కేంద్రంలోని బిజెపి మనుధర్మం పాటించి భర్త ఏమి చేసినా కట్టుబడి ఉండాలనే బోధనలు చేస్తూ మహిళలను అణచివేస్తోందన్నారు. భర్త కొట్టినా, చంపినా కట్టుబడి ఉండాలంటూ ఆపార్టీ నేతలు బహిరంగంగానే చెబుతుండడం సిగ్గుచేటన్నారు. భర్త ఏమి చేసినా చెల్లుబాటు అవుతుందనే ధోరణి అవలంభించడం సరికాదన్నారు. ప్రభుత్వాలు ఇలాంటి వాటిని ప్రోత్సహించే విధంగా కాకుండా నిర్మూలించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. లైంగిక వేధింపుల నిరోధక చట్టం అమలుపై కమిటీలు నిర్వహించి విద్యాసంస్థలు, పని ప్రదేశాల్లో చైతన్యం పెంపొందించాలన్నారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం విచ్చల విడిగా మద్యం అమ్మకాలు సైతం మహిళలపై దాడులకు ఓ కారణం అన్నారు. మద్యానికి బానిసలుగా మారిన వారు అత్యాచారాలు, హత్యలు, దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. తాగుబోతుల వల్ల సమాజాంలో హింస పెరుగుతోందన్నారు. తక్షణం రాష్ట్రంలో మద్యపానంను నిషేధించాలన్నారు. అనంతపురంలో లాంటి ఘటనలు పనరావృతం కాకుండా ప్రభుత్వం నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర నాయకురాలు వి.సావిత్రి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామల, రాజేశ్వరి, జిల్లా సహాయ కార్యదర్శి రేణుక పాల్గొన్నారు.

పారిశ్రామిక అభివృద్ధికి చేయూత

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

పారిశ్రామిక అభివృద్ధికి ఔత్సాహికవేత్తలకు చేయూత నందిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ కె.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ దాసరి సునీత, జెడ్పిటిసి భాస్కర్, వైస్ ఎంపీపీ సాకే జయలక్ష్మి, స్టేట్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్‌రావు ఔత్సాహిక వేత్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదరిక నిర్మూలనలో భాగంగా యువతకు నిరుద్యోగం నుండి విముక్తి కల్పించుటకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రమల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తోందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్ కేటగిరి యువతీ యువకులకు పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. ప్రతి ఒక్కకూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకు మేనేజర్ ప్రసాద్‌రావు మాట్లాడుతూ బ్యాంకు నిబంధనల ప్రకారం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. మరింత సమాచారం కోసం అనంతపురం జిల్లా పరిశ్రమల కేంద్రం నందు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌బిఎన్ విద్యాసంస్థలను పరిరక్షించుకుందాం

ఐక్య విద్యార్థి యువజన సంఘాల నేతలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఎస్ఎస్‌బిఎన్ కళాశాలలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ జరపాలని, సంబంధిత యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్‌బియన్ కళాశాల పరిరక్షణ కమిటీ, విద్యార్థి, యువజన సంఘాల ఐక్య వేదిక నేతలు డిమాండ్ చేశారు. శనివారం రోడ్లు భవనాల శాఖ అతిథిగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పరమేష్, సూర్యచంద్ర యాదవ్, ఏపీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆకుల రాఘవేంద్ర, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వెంకటప్ప, బాలకృష్ణ యాదవ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిసి.సురేష్, నిరుద్యోగుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు రామన్న, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి వీరేంద్ర హాజరై మాట్లాడుతూ ఎస్-ఎస్‌బిఎన్ కళాశాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల అక్రమాలపై విచారణ జరపాలన్నారు. అక్రమాలపై ఎఫ్ఐఆర్ నమోదు అయినప్పటికి సంబంధిత యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోవడం శోచనీయంగా

కరపత్రాలను విడుదల చేస్తున్న విద్యార్థి, యువజన సంఘాల ఐక్యవేదిక నాయకులు

ఉందన్నారు. రూ.70 నుంచి రూ.80 లక్షల వరకు విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌ను ఇతర ఖాతాలకు మళ్లించారని తెలపారు. అది కాస్త బయటకు పొక్కడంతో ఆయా శాఖల సంక్షేమ శాఖ అధికారులు రంగంలోకి దిగా విచారణ చేశారన్నారు. కళాశాలకు నోటీసులు కూడా జారీచేశారని తెలిపారు. ఆ తర్వాత కొంత కొంత మొత్తాలను సుమారు రూ.25 నుంచి రూ.30 లక్షలు కళాశాల యాజమాన్యం వెనక్కు చెల్లించిందన్నారు. ఇంతకాలం లక్షలాది రూపాయలను కళాశాల అకౌంట్లలో భద్రపరచగా బ్యాంకుల నుంచి వచ్చిన వడ్డీని యాజమాన్యం నుంచి వసూలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని అక్రమాలు అరికట్టాలన్నారు. కళాశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కళాశాలను పరిరక్షించుకోవడానికి పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వమే కళాశాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జెవిసి నాయకులు రవిచరణ్, కమల్, అష్రాఫ్‌వలి, అశోక్, అనిల్, సందీప్‌రెడ్డి, ఉపేంద్ర, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా ఉత్పత్తి రంగం

ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.హేమచంద్రారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

రాబోయే రోజుల్లో ఉత్పత్తి రంగం మరింత అభివద్ధి చెందుతుందని, ఈ నేపథ్యంలో ప్రతి విద్యార్థీ ఇంటర్న్‌షిప్ చేసే విధంగా ప్రోత్సహించాలని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి సూచించారు. శనివారం సాయంత్రం స్థానిక జెఎన్టీయూ పరిపాలన భవనం కాన్ఫరెన్స్ హాల్‌లో ఉపకులపతి రంగజనార్ధన అధ్యక్షతన వర్సిటీ డైరెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన అభివద్ధిని ఎప్పటికప్పుడు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. వర్సిటీలో జరిగే ప్రతి కార్యక్రమాన్ని ప్రజలకి వివిధ మాధ్యమాల ద్వారా చేరువయ్యేలా చూడాలని తెలిపారు. విద్యార్థులు ఇంటర్న్‌షిప్ పూర్తి చేసేలా అధ్యాపకులు కషి చేయాలన్నారు. అనంతరం విసి వర్సిటీలో జరిగిన పలు అభివద్ధి కార్యక్రమాలను వివరించారు. జాతీయ ర్యాంకింగ్‌లో యూనివర్సిటీ మరింత అభివద్ధి కోసం చేపడుతున్న చర్యలను వివరించారు. ఐదు ప్యారా మీటర్స్ ఎలా పూర్తి చేయాలి.? అందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ విజయకుమార్, రిజిస్ట్రార్ శశిధర్, ఓఎస్‌డి దేవన్న, ప్రిన్సిపాల్ సుజాత, డైరెక్టర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న హేమచంద్రారెడ్డి

వికలాంగుల పింఛన్ల పరిశీలన

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోని వికలాంగులకు సంబంధించిన పింఛన్లను పరిశీలిస్తున్నట్లు ఎంపీడీవో యోగానందరెడ్డి తెలిపారు. శనివారం అరకటివేమల సచివాలయానికి సంబంధించిన వికలాంగుల పింఛన్లను ఆయన పరిశీలించారు. ఇందు కోసం సచివాలయానికి ఒక ఆఫీసర్‌ను నియమించినట్లు తెలిపారు. అరకటివేముల సచివాలయానికి సంబంధించి ఎంపీడీవో యోగానందరెడ్డి, కడవకల్లు, కోమటికుంట్ల సచివాలయాలకు సంబంధించి ఈవోఆర్డీ ఆనంద ప్రసాద్, సూరే పల్లి, తక్కల్లపల్లి సచివాలయాలకు పీఏవో శ్రీధర్, పుట్లూరు, బాలాపురం సచివాలయాలకు ఎంఈవో శ్రీదేవి, మడుగుపల్లి, వెలుట్ల సచివాలయాలకు ఏపీవో చెన్నకేశవులు, కుమ్మనమల సచివాలయానికి ఎపిఎం వెంకటరామిరెడ్డి, మడ్డిపల్లి, దోసలేడు సచివాలయాలకు హౌసింగ్ ఏఈ లోకేష్‌కుమార్, ఎస్.గూడూరు సచివాలయానికి ఐసిడిఎస్ వెలుగు రాజామణిని నియమించామని వెల్లడించారు.

ఫైనేట్ ఎలిమెంట్ అనాలసిస్‌పై అవగాహన

ప్రజాశక్తి-అనంతపురం

అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ మూడవ, నాల్గవ సంవత్సరం విద్యార్థులకు ఫైనేట్ ఎలిమెంట్ అనాలసిస్, సిఎఇ సిమ్యులేషన్స్ అంశంపై గెస్ట్ లెక్చర్‌ను శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బెంగళూరు యు కెన్ టెక్నాలజి జిఎం.రాజేంద్ర హాజరయ్యారు. మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు మోడలింగ్, సిమ్యులేషన్స్ టెక్నాలజీ ద్వారా మోడలింగ్, డిజైనింగ్ అనాలసిస్ ఎలా చేయవచ్చో ప్రయోగాత్మకంగా వివరించారు. కోర్ విభాగం నందు విద్యార్థులకు గల ఉద్యోగావకాశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ అనంత రాముడు, వైస్ ఛైర్మన్ రమేష్ నాయుడు, ప్రిన్సిపల్ మూర్తిరావు ఖోకలే, నైపుణ్యాభివృద్ధి సంచాలకులు సురేంద్ర నాయుడు, ఇంజనీరింగ్ విభాగాధిపతి రాయుడు పెయ్యాల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు నార్పలకు మంత్రి ఉష శ్రీచరణ్ రాక

ప్రజాశక్తి-నార్పల

కనకదాస జయంత్యుత్సవాలను పురస్కరించుకుని మంత్రి ఉష శ్రీచరణ్ ఆదివారం నార్పల మండల కేంద్రానికి విచ్చేయనున్నట్లు మండల కురువ సంఘం నాయకులు తెలిపారు. జిల్లాలోని కురువ సంఘం బాంధవులు పార్టీలకతీతంగా పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి సన్మానం

ఆత్మకూరు : తోపుదుర్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆత్మకూరు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో 21 బోర్లు వేశారు. అందులో పుష్కలంగా నీరు పడింది. దీంతో కాలనీవాసులు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిని శనివారం సన్మానించారు. కాలనీవాసులు మాట్లాడుతూ.. 2008లోనే ఇళ్లు కట్టుకునేందుకున స్థలం కొని ఇచ్చారని. అందులో ఆర్డీటీ వారు ఇళ్లు కట్టిఇచ్చారనితెలిపారు. ఆయనకు కృతజ్ఞతగా ఉంటామని తెలిపారు.

మూలనపడ్డ స్వచ్ఛభారత్ వాహనాలు

ఆత్మకూరు : మండల కేంద్రంలో చెత్త సేకరణకు ఉపయోగించే స్వచ్ఛభారత్ వాహనాలు మూలనపడ్డాయి. సచివాలయం1లో ఉన్న 3 చెత్త సేకరణ సైకిళ్లు, 4 ఆటోలు, డ్రెయినేజీలు శుభ్రం చేయడానికి తీసుకొచ్చిన ట్రాక్టర్లను ఉపయోగించిన పాపానికి కూడా పోలేదు. చివరికి అవి తుప్పుపట్టి రూ.15 లక్షల ప్రజాధనం నష్టపోయే అవకాశం ఉందన్న చర్చ నడుస్తోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వాహనాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

జాతీయ ఐక్యతాదినోత్సవం

అనంతపురం : అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ ఐక్యత దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కళాశాల ఛైర్మన్ అనంతరాముడు విచ్చేసి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

గార్లదిన్నె : గృహనిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టరు కేశవనాయుడు అధికారులకు సూచించారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా కల్లూరు గ్రామంలో నవరత్నాలు పేదలందరికీ ఇల్లుకార్యక్రమం శనివారం నిర్వహించారు. అనంతరం రెండో సచివాలయం నందు లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. లేఅవుట్ కాలనీని పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న లబ్ధిదారులతో రోడ్లు, కరెంటు, తాగునీరు సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.

సజావుగా మండల సమావేశం

గుత్తి : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం సజావుగా జరిగింది. ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండలంలో నెలకొన్న పలు సమస్యలు, అభివృద్ధి పనులపై అధికారులు, సభ్యులు చర్చించారు. సమావేశంలో ఎంపీడీవో అమతరాజ్, తహశీల్దార్ మహబూబ్ బాషా, ఈవోఆర్డీ శివాజీరెడ్డి, ఎంఇఒ రవినాయక్, పంచాయతీరాజ్ ఎఇ దివ్య ప్రకాష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మంజునాథ్, ఎంపిటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

గుత్తి : పట్టణంలోని క్రీడా మైదానం వద్ద ఉన్న ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం కార్యాలయంలో శనివారం జరిగిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. నంద్యాలకు చెందిన శాంతిరాం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ బొబ్బు యాదవ్ కంటి, గుండె, మోకాళ్ల పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం మండల అధ్యక్షుడు కె.అబూబకర్, కార్యదర్శి రామ్మోహన్, అదనపు కార్యదర్శి జేన్నే కుల్లాయి బాబు, ఉపాధ్యక్షులు స్వర్ణాంబ, సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, ఆసుపత్రి సిబ్బంది సంగీత, నిర్మల, ప్రసన్న, సాయి, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

బియ్యం, నగదు వితరణ

ఉరవకొండ : ఉరవకొండ పట్టణంలోని అయ్యప్ప దేవస్థానంలో అన్నదానం కోసం కర్నాటకకు చెందిన భక్తులు నగదు, నిత్యావసరాలను శనివారం అందజేశారు. బళ్లారి నగరానికి చెందిన పార్వతీ రోడ్ లైన్స్ అధినేత గిరిధర్‌రెడ్డి ఒక క్వింటాల్ కంది బేడలు, హమాలీ మేస్త్రి భవానిస్వామి శ్రీనివాసులు బస్తా బియ్యం, పిఆర్ రోడ్‌లైన్ అధినేత లక్ష్మన్న క్వింటాల్ బియ్యం, మణికంఠ బస్సు అధినేత శ్రీనివాసులు బాబు రూ.5116 నగదును అందజేసినట్లు మాలపాటి బ్రహ్మానాయుడు తెలిపారు.

గ్రామ పంచాయతీ సమావేశం

ఉరవకొండ : ఉరవకొండ మేజర్ పంచాయతీ సమావేశం సర్పంచి లలిత అధ్యక్షతన శనివారం నిర్వహించారు. పంచాయతీలోని పలు సమస్యలను సభ్యులు అధికారులు, సర్పంచి దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని సర్పంచి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఉప సర్పంచి వన్నప్ప, గ్రామ కార్యదర్శి గౌస్ సాహెబ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సచివాలయం పరిశీలన

పుట్లూరు : కడవకల్లు గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో యోగానంద రెడ్డి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్, మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన సిబ్బందితో మాట్లాడుతూ అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైతుకు కష్టమే మిగులు..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నిత్యం కరువుకు నిలయమైన అనంతపురం జిల్లాలో ఈ ఏడాది మంచి వర్షాలు పడ్డాయి. ప్రతి మండలంలోనూ సాధారణం కంటే అధికంగా వర్షాలు పడ్డాయి. నీటి జాడ ఎక్కడ చూసినా కనిపిస్తోంది. అయినా ఏమి లాభమన్నట్టుగా ఉంది రైతు పరిస్థితి. గతంలో వర్షాల్లేక నష్టపోతుంటే, ఈసారి అధిక వర్షాలు నట్టేట ముంచుతున్నాయి. వర్షాలు తగ్గుముఖం పట్టాక తెగుళ్ల అధికమయ్యాయి. ఈ తెగుళ్ల ప్రభావం రైతు దిగుబడులపై పడుతున్నాయి. ఇప్పటికే పత్తి పంట ఇదే రకంగా అధిక వర్షాలకు పూత రాలిపోయి దిగుబడి తగ్గుతోంది. దీంతో కొన్ని చోట్ల పంటను పశువుల మేతక వదిలేస్తున్నారు. సుమారు పెట్టుబడి కిందనే ఎకరానికి రూ.30 వేల వరకు నష్టం వాటిల్లింది. ఆ తరువాత మిరప పంటకు అత్యధికంగా నష్టం వాటిల్లే పరిస్థితులు నెలకొన్నాయి. నల్లతామర పురుగు ఈ వాతావరణానికి అధికంగా ఆశిస్తోంది. పూతలోకి చేరుకుని తినేడం వల్ల దిగుబడి పడిపోతోంది. దీని నివారణకు పురుగుల మందులు కొట్టేందుకు మరింత వ్యయం పెరుగుతోంది. జిల్లాలో సుమారు 67 వేల ఎకరాల్లో మిరప పంట సాగైంది. దీన్ని రక్షించుకోవడానికి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. టమోటా పంట వర్షాలతో దిగుబడి వచ్చినా ఎగుమతులు చేయడానికి వీల్లేకుండాపోవడంతో ఈసారి రైతుకు పెట్టుబడి కూడా రాలేదు. ఇప్పుడు అరటికి సిగటోమా భయపెడుతోంది. ఉమ్మడి జిల్లాలో 40 వేల ఎకరాల్లో ఈ పంటలు సాగయ్యాయి. ఒక్క అనంతపురం జిల్లాలోనే 23 వేల ఎకరాల వరకు ఉంది. ఇది వస్తే పంట దిగుబడి ఎలాగున్నా వచ్చిన పంటను కొనేందుకు వ్యాపారులెవరూ ముందుకు రారు. ఈ రకంగా రెండు విధాలుగానూ రైతులు నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ తెగుళ్ల వరకు జరిగే నష్టానికి ఏ మేరకు ప్రభుత్వ సాయం అందుతుందన్నది ప్రశ్నార్థకంగా ఉంది. ఎందుకంటే అధిక వర్షాలు, వర్షాభావ పరిస్థితుల్లో పంటనష్టం జరిగితే కొంత వరకు బీమా ద్వారానో... ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారానో ఆదుకునే అవకాశముంది. తెగుళ్ల వల్ల నష్టం జరిగితే ఆ అంచనాలు రూపొందించే ప్రక్రియ ఏదీ బీమా పరిధిలో లేదు. దీంతో రైతుకు తెగుళ్ల వల్ల జరిగే నష్టానికి అందే సహాయం లేదనే చెప్పవచ్చు. ఈ ఏడాది అధిక వర్షాలతో వస్తున్న తెగుళ్లు పంటలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ప్రధానంగా ఉద్యానవన పంటలకు డ్రై కండిషన్స్ ఉంటేనే దిగుబడులకు అనుకూలం. జిల్లాలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు భూగర్భ జలాలు బాగా ఉండటంతో ఉద్యానవన పంటల సాగు బాగా పెరిగింది. అధిక పెట్టుబడులు పెట్టి పంటలను సాగు చేస్తున్నారు.

ఇప్పుడు ఈ వాతావరణానికి తెగుళ్ల అధికమవుతుండటంతో నష్టమూ అదే స్థాయిలో ఉంటోంది. ప్రభుత్వం ఉద్యానవన పంటలకు తెగుళ్ల వల్ల జరిగే నష్టానికి ఆదుకునే వ్యవస్థ ఏదైనా రూపొందించాలని కోరుతున్నారు. వర్షాధారం కింద సాగైన వేరుశనగ పంటకు ఈసారి గిట్టుబాటు ధర లభించడంలేదు. వ్యాపారులు వేరుశనగ కాయలు కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేస్తామని చెబుతున్నా ఇప్పటికీ ఇంకా ఆ ప్రక్రియ ప్రారంభమవలేదు. ప్రధాన పంట వేరుశనగ రైతు ఇప్పుడు గిట్టుబాటు ధర కోసం ఎదురు చూస్తున్నాడు.

21న తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కోరుతూ ఈ నెల 21వ తేదీన జిల్లాలోని మండల తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు వి.శివారెడ్డి, విటి.రామాంజినేయులు తెలిపారు. శనివారం ఆ సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఖరీఫ్‌లో పంట చేతికి వచ్చే సమయంలో అధిక వర్షాలు రావడం వల్ల పొలాల్లోనే మొలకలు ఎత్తి కుళ్లిపోయి పంట నష్టపోయారన్నారు. వేరుశనగ, వరి, పత్తి, మొక్కజొన్న, మిరప, ప్రొద్దుతిరుగుడు పంటలు నష్టపోయాయని తెలిపారు. రైతులకు కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లిందన్నారు. తక్షణమే రైతులను ఆదుకోవాలన్నారు. ఎకరాకు రూ.25 వేలు ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలన్నారు. ఇన్సూరెన్స్ జమ చేయాలన్నారు. ఈ క్రాప్ చేసిన రైతులందరికి రశీదు ఇవ్వాలన్నారు. 21న తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న ధర్నాకు రైతులు, వ్యవసాయ కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు వెంకటచౌదరి, లక్ష్మీనారాయణరెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వంతో విరాళాలు అందించాలి

మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య నీరజ

అనంతపురం : అనాథ బాల బాలికలకు మానవత్వతో విరాళాలు అందించాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య నీరజ అన్నారు. ప్రతి ఏటా నవంబర్ 19 నుంచి 25వ తేది వరకు జరిగే మతసామరస్య వారోత్సవాలలో భాగంగా ప్రభుత్వం మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ మెడికోలు ప్రిన్సిపల్ ఆచార్య నీరజ ఆధ్వర్యంలో అనాథ బాల బాలికల కోసం శనివారం విరాళాల సేకరణ చేపట్టారు. కుల మతాల కుమ్ములాటల వల్ల, ఉగ్రవాదుల దాడుల వల్ల తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ బాలబాలికల సహాయార్థం భారత రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడిచే నేషనల్ ఫౌండేషన్ ఫర్ కమ్యూనల్ హార్మోని శాఖకు ప్రతి సంవత్సరం విద్యార్థులు విరాళాలను సేకరించి భారత రక్షణ శాఖకు పంపిస్తారన్నారు. ఎవరికివారు వారికి తోచినంత విరాళాలను అందించడం ద్వారా వారి చదువుకు, వసతి, ఆరోగ్య సదుపాయాలకు ఈ విరాళాలను రక్షణశాఖ అత్యంత పారదర్శకంగా ఉపయోగిస్తుందని తెలియజేశారు. మెడికల్ కళాశాల అకడమిక్ వైస్ ప్రిన్సిపల్స్ ఆచార్య డాక్టర్ షారోన్ సోనియా, ఆచార్య డాక్టర్ ఆరేపల్లి శ్రీదేవి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ మనోరంజన్ రెడ్డి, డాక్టర్ శారద, డాక్టర్ విజయ్ కుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశి నాయుడు, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాలకు విశ్వేశ్వరరెడ్డికి ఆహ్వానం

ఉరవకొండ : ఉరవకొండ చెరువుకట్ట సమీపంలో వెలసిన పురాతన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి షష్టి ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డిని ఆలయ ఈవో, కమిటీ సభ్యులు ఆహ్వానించారు. శనివారం అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎంసి కరిబసి, సభ్యులు జికె సుబ్బలక్ష్మి, వేమన్న, శంకరయ్య, ఆలయ ఈవో అంగదాల కృష్ణయ్య తదితరులు ఆయనను కలిసి ఆహ్వాన పత్రికను అందజేసారు. స్వామివారి షష్టి ఉత్సవాలు ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు జరుగుతాయని ఉత్సవాలకు తప్పక హాజరు కావాలని ఆయనను కమిటీ సభ్యులు కోరారు.

చంద్రబాబు ఓ మోసకారి

రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

చంద్రబాబు తన పాలనలో 30 లక్షల మంది పేదలకు ఇళ్లు నిర్మిస్తానని మోసం చేసిన చీటర్ అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం అనంతపురం నగరంలోని రోడ్లు భవనాల అతిథి గృహంలో విలేకరులలో ఆయన మాట్లాడుతూ టీడీపి అధికారంలో ఉన్న రోజుల్లో రాష్ట్ర ప్రజలను అప్పులపాలు చేస్తే.. జగనన్న ఆసరాగా నిలిచారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారికి అండగా నిలిచారన్నారు. 30 లక్షల మంది పేదలకు ఇంటిపట్టాలిచ్చి ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నారన్నారు. వారందరికీ రూ.లక్షల విలువజేసే ఆస్తిని అప్పగిస్తున్నారని చెప్పారు. అదే చంద్రబాబు తన పాలనలో 30 లక్షలమందికి ఇల్లు నిర్మిస్తానని మోసం చేసిన చీటర్ గా నిలిచాడని ఎద్దేవా చేశారు. కర్నూలు జిల్లా పర్యటనలో చంద్రబాబు వ్యాఖ్యలు చూస్తుంటే టిడిపి తెలుగు దోపిడీ పార్టీ కాదు.. తిట్లు దండకాల పార్టీ అని అర్థమవుతోందని అన్నారు. కాటికి కాళ్ళు చాపిన బాబుకు ఇవే చివరి ఎన్నికలు అన్నారు. అప్పటిదాకా ఉంటాడో లేదో కూడా తెలీదన్నారు. నోరు చించుకుని మాట్లాడుతూ లేని అనారోగ్యాలు తెచ్చుకుని పోతావేమో జాగ్రత్త బాబూ.. అంటూ ఎద్దేవా చేశారు. మొన్న ఎన్నికల్లో టిడనిపి 23 సీట్లు వచ్చాయని, ఇప్పుడు అవికూడా రావని జోష్యం చెప్పారు. 2014 ఎన్నికల ముందు దత్తపుత్రుడిని తయారు చేసుకుని ఆయనను వాడుకున్నాడన్నారు. ఈయనకు రైటర్, స్క్రిప్టు, డైరెక్షన్, ప్రొడ్యూసర్ అంతా చంద్రబాబే అని తెలిపారు. ఈయన డైరెక్షన్లోనే దత్తపుత్రుడు అప్పుడప్పుడూ బయటకు వచ్చి మాట్లాడి వెళ్లిపోతుంటాడని చెప్పారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు జగన్‌కు పడకుండా దత్తపుత్రుడికి పడితే తాను లాభపడతాననేది చంద్రబాబు దురాలోచన అని మండిపడ్డారు. రాప్తాడు మార్కెట్ యార్డు ఛైర్మన్ గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపిపి రామాంజనేయులు, సికె.పల్లి వైసీపీ నాయకులు నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

డిజిటల్ గ్రంథాలయాల రూపకల్పనే ధ్యేయం

జిల్లా ఛైర్‌పర్సన్ ఉమా మోహన్ రెడ్డి

బహుమతులు అందజేస్తున్న ఛైర్‌పర్సన్ ఉమా మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సంపూర్ణ డిజిటల్ గ్రంథాలయ వ్యవస్థగా రూపొందించడమే ధ్యేయంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఉమా మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం విడపనకల్, ఉరవకొండ గ్రంథాలయాల అధికారులు శ్రీనివాసులు, వై.ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథులుగా జిల్లా ఛైర్‌పర్సన్ ఉమా మోహన్‌రెడ్డి, మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్‌రెడ్డి, విడపనకల్ వైస్ ఎంపీపీ కరణం పుష్పావతి భీమ్ రెడ్డి, జెడ్పిటిసి హనుమంతు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని అన్నారు. వీటిని ఉపయోగించుకొని యువత బంగారు భవితకు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. మారుతున్న కాలానుగుణంగా సాంకేతిక సమాచార పద్ధతులన్నింటినీ గ్రంథాలయాల్లో దశలవారీగా అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగానే ప్రతి గ్రామంలో ఇంటర్నెట్ ద్వారా ప్రజలకు నిరుద్యోగ యువతకు ఆధునిక సమాచారాన్ని అందచేసేందుకు ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు అతిథులను సన్మానించారు. గడేకల్, హవలిగి, పాల్తూర్ గ్రామాల్లో నూతన గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఛైర్‌పర్సన్ ఉమా మోహన్ రెడ్డికి వైస్ ఎంపీపీ కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు కరణం భీంరెడ్డి, భరత్ రెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గిరిబాబు, ఎస్సీ సెల్ స్టీరింగ్ కమిటీ సభ్యులు సుంకన్న, వైసిపి నాయకులు దేశాయ్ సిద్ధార్థ, వీరన్న, ఎర్రి స్వామి, సిపిఐ నాయకులు చెన్నరాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా తగుపర్తి, బెలుగుప్ప జిల్లా పరిషత్ పాఠశాల, కెజిబివి విద్యార్థులకు శనివారం వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత, ఎస్ఒ మంజుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తగ్గుపర్తి, బెలుగుప్ప గ్రంథాలయ అధికారులు ప్రతాపరెడ్డి, పురుషోత్తమ నాయుడు, ఉపాధ్యాయులు గిరిజ, శ్రీనివాసులు, రాము, రాజశేఖర్, పిటి.రామచంద్ర, రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు

పుట్లూరు : గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ముఖ్య అతిథి భూమిరెడ్డి పెద్దనారాయణరెడ్డి 20 మందికి గ్రంథాలయంలో శాశ్వత సభ్యత్వ చేయించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనరసింహులు, భూమిరెడ్డి పెదనారాయణరెడ్డి, సర్పంచు ఓబులేసు, మురళి, ఉపాధ్యాయులు రాజశేఖర్, మల్లికార్జున, అనిత, కెజిబివి, మోడల్‌స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

21న బిటిపి ఆయకట్టు రైతుల సమావేశం

రాయదుర్గం : భైరవాణితిప్ప ప్రాజెక్టు ఆయకట్టు రైతుల సమావేశం ఈనెల 21వ తేదీన ప్రాజెక్టు వద్ద నిర్వహిస్తున్నట్లు గుమ్మగట్ట జెడ్పిటిసి సభ్యులు పిఎస్ మహేష్ తెలిపారు. శనివారం రాయదుర్గంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం జరగనున్న సమావేశంలో ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల కింద ఉన్న ఆయకట్టు రైతులందరూ పాల్గొనాలని కోరారు. రిజర్వాయర్‌లో నీటి నిల్వ ఆధారంగా ఆయకట్టు భూములకు నీటిని ఎప్పుడు వదిలేది ఈ సమావేశంలో నిర్ణయించబడుతుందని తెలిపారు. ఆయకట్టు కాలువలకు, నీటి నిర్వహణకు పదిమంది లస్కర్లను నియమించాలని విప్ కాపు రామచంద్రారెడ్డి కలెక్టరును కోరారన్నారు. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు బిటి ప్రాజెక్టు, కలుగోడు చెరువులను సందర్శించిన సందర్భంగా ఆయన తనపై చేసిన ఆరోపణలు సమంజసంగా లేవన్నారు. కాలవ శ్రీనివాసులు మంత్రిగా ఉన్నప్పుడు ఏనాడు రైతుల గురించి పట్టించుకోలేదన్నారు. నేడు ఆయకట్టుకు నీరు వదలలేదని చెప్పడం సరికాదన్నారు. కలుగోడు చెరువు కాలువలను పూడ్చి అక్రమంగా తాను నీటిని మళ్లించుకున్నట్లు చేసిన ఆరోపణలు నిరాధారమైనవని అన్నారు. తాను కాలువను ఆక్రమించినట్లు నిరూపిస్తే తన భూములను వారు కోరిన వారికి రాసిస్తానన్నారు. నిరూపించకపోతే శ్రీనివాసులు రాయదుర్గం విడిచి వెళ్తారా అని ప్రశ్నించారు. సమావేశంలో వైసిపి నాయకులు సత్యనారాయణరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, బేలోడు రామాంజనేయులు, కలుగోడు సర్పంచి ఉమేష్ రెడ్డి, గృహ నిర్మాణ సంస్థ రాష్ట్ర డైరెక్టర్ ఐ.శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాలనలో నూతన ఒరవడి : ఎమ్మెల్యే అనంత

అనంతపురం : పరిపాలనలో నూతన ఒరవడిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సృష్టించారని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని మరింత చేరువ చేయడానికే వైఎస్‌ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. శనివారం నగరంలోని బుడ్డప్పనగర్, రెండవ రోడ్డు, ఆదిమూర్తి నగర్‌లలోని మూడు వైఎస్‌ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఎంపీ తలారి రంగయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ ప్రజల కనీస అవసరాలు తీర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఇందులో భాగంగా వైద్యం, విద్యకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా వైఎస్‌ఆర్ విలేజ్ క్లినిక్‌లను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. సిఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉండడం వల్లే మూడేళ్లలో మార్పు సాధ్యమైందని ఎంపీ తలారి రంగయ్య తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించడంతో పాటు భారీ స్థాయిలో పోస్టులను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో నగర మేయర్ మహమ్మద్ వసీం, మునిసిపల్ రీజినల్ డైరెక్టర్ పీవీవీఎస్ మూర్తి, కమిషనర్ భాగ్యలక్ష్మి, ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ యుగంధర్, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్లు మీనాక్షి, చంద్రమోహన్‌రెడ్డి, హసీనా, ముంతాజ్‌బేగం, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి : పట్టణ శివారులోని ఎన్టీపీసీ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం పెండేకల్లు చెందిన రంగస్వామి ద్విచక్ర వాహనంలో ప్యాపిలికి వెళ్తుండగా కారు ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అతన్ని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం క్షతగాత్రున్ని అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కర్ణాటక మద్యం బాటిళ్లు పట్టివేత

గుత్తి : కర్ణాటక రాష్ట్రానికి చెందిన మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తుండగా గుత్తి సెబ్ సిఐ బి.వరలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం పట్టుకున్నారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకి చెందిన బాజారీ, రామాంజనేయులు, మల్లికార్జునలు కర్ణాటక చెందిన 3840 ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ బాటిళ్లు బొలెరో వాహనంలో తరలిస్తున్నారు. గుత్తి సెబ్ స్టేషన్ పరిధిలోని కాశేపల్లి టోల్ ప్లాజా వద్ద శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమ మద్యం బాటిళ్లు బయటపడినట్లు సెబ్ సిఐ తెలిపారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఆమె చెప్పారు. నిందితులను అరెస్టుచేసి కోర్టుకు హాజరపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు సిఐ వెల్లడించారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ అహ్మద్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో సెల్‌ఫోన్ల దొంగ

నార్పల : నార్పల మండల కేంద్రంలో శనివారం నిర్వహించే సంతలో సెల్‌ఫోన్లను చోరీచేసే దొంగను స్థానికులు పట్టుకున్నారు. అతన్ని పోలీసులకు అప్పగించారు. నార్పల సంతలో ఇటీవల సెల్‌ఫోన్ చోరీలకు పాల్పడుతున్నారు. దీనిపై ఎస్ఐ వెంకటప్రసాద్ నిఘా పెట్టారు. మఫ్టీలో పోలీసులను ఏర్పాటు చేశారు. స్థానికులు సెల్‌ఫోన్ దొంగను పట్టుకుని పోలీసులకు అప్పగించడంతో విచారణ చేపట్టారు. ముఠా సభ్యులు ఎంతమంది ఉన్నారు, వారు ఎక్కడి నుంచి వచ్చారు తదితర వివరాలు విచారణలో తేలాల్సివుంది.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నార్పల : నార్పల మండల కేంద్రంలోని వైన్ షాప్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి శనివారం మృతిచెందాడు. మృతునికి 45 సంవత్సరాల వయసు ఉంటుంది. కేసు నమోదు చేసుకుని మృతుని వివరాల కోసం అన్వేషిస్తున్నట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు.

అపరాధ రుసుం వసూలు

గుంతకల్లు : మున్సిపాలిటీ పరిధిలో అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేసుకున్న ఐదుగురు భవన యజమానులకు లోక్‌అదాలత్‌లో కోర్టు విధించిన రూ.1,38,478 అపరాధ రుసుము శనివారం వసూలు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న విలేకరులకు తెలిపారు. భవన నిర్మాణాలకు అనుమతులు తీసుకుని నిబంధ నలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండా అనధికార కట్టడాలు చేసిన వారిపై మున్సిపల్ చట్టం ప్రకారం కోర్టుల్లో ఫైల్ చేశామన్నారు. దీంతో కోర్టు వారు లోక్‌అదాలత్‌లో వారికి విధించిన మేరకు అపరాధ రుసుము వసూలు చేశామ న్నారు. ప్రజలు తమ భవన నిర్మాణాలను మున్సిపాలిటీ అనుమతులు తీసుకుని ఆమేరకు కట్టడాలు చేసుకుని పట్టణ సుందరీకరణకు సహకరించాలని కమిషనర్ కోరారు.

'శ్రీ చైతన్య'లో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం

అనంతపురం : స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ చైతన్య బాలికల రెసిడెన్షియల్ స్కూల్ నందు శనివారం ట్రాఫిక్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ముఖ్యఅతిథి ఎజిఎం సుబ్బారెడ్డి పచ్చజెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థినులు ర్యాలీగా అనంతపురం వీధుల్లో తిరిగి రోడ్డు భద్రత అంశాలపై అవగాహన కల్పించారు. హెల్మెట్, సీటు బెల్టు ధరించని వారికి గులాబీ పుష్పం అందించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యమధర్మరాజు పౌరానిక నాటికల ద్వారా అవగాహన కల్పించారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శివరాంప్రసాద్ ఇలాంటి కార్యక్రమాలని ప్రోత్సహిస్తున్నందుకు శ్రీ చైతన్య యాజమాన్యాన్ని అభినందించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు సేఫ్టీ పద్ధతులను అవలంభించి నూతన భావి జీవితానికి మార్గదర్శకులు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యం చేయడంలో విద్యార్థులే కీలకం

రాయదుర్గం : జగన్మోహన్ రెడ్డి అవినీతి, అక్రమ, దుర్మార్గ పాలనపై ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయడంలో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని రాయదుర్గం పట్టణ టిడిపి అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక రాయల్ కాలేజి విద్యార్థులతో ఆయన సమావేశం అయ్యారు. టిఎన్ఎస్ఎఫ్ విద్యార్థి విభాగం అధ్యక్షుడుగా కె.విశ్వనాథ్, ఉపాధ్యక్షులుగా భానుప్రకాష్, లలిత, సింధుజ, ప్రధాన కార్యదర్శిగా రాఘవేంద్రలను ఎన్నుకున్నారు. వసతి దీవెన కింద విద్యార్థులకు రావాల్సిన నిధులు, స్కాలర్ షిప్ లపై టిఎన్ఎస్ఎఫ్ విభాగం పోరాడాలని సూచించారు. కరెస్పాండెంట్ బండి సుధాకర్, రాష్ట్ర టిఎన్ ఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు అగ్రహారం కిరణ్, జిల్లా కార్యదర్శి భరత్, బిసి సెల్ కార్యదర్శి కృష్ణ, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మల్లి, నియోజకవర్గ తెలుగు యువత కమిటీ సభ్యులు తిప్పేస్వామి, సత్తి, ప్రహ్లాద పాల్గొన్నారు.

ఓటమి భయంతో పిచ్చి ప్రేలాపనలు

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

శింగనమల : వై నాట్ 175 అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నప్పటి నుంచి ప్రతిపక్ష నేత చంద్రబాబు వణికిపోతున్నారని, అందుకే కొంతకాలంగా నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి విమర్శించారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. అందర్నీ బెదిరించడం వల్ల ఓట్లు వస్తాయని అనుకోవడం చంద్రబాబు పాలసీ అన్నారు. కులమత, పార్టీ భేదాలు లేకుండా ప్రతి ఒక్కరికీ పథకాలు అమలుచేయడం ద్వారా ప్రజల మనసు గెలుచుకోవచ్చు అనేది జగన్మోహన్ రెడ్డి పాలసీ అని చెప్పారు. రాయలసీమను రతనాలసీమ చేశానని చంద్రబాబు అంటున్నారని, ఆయన ఏం చేశారో చెప్పాలన్నారు. చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుందన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ ఊడ్చుకొని పోతుందని స్పష్టంగా తెలిసిపోతోందని, అదే ఆక్రోశం ఆయన ప్రసంగాల్లో వ్యక్తమవుతోందని అన్నారు. రాయలసీమకు న్యాయ రాజధాని వస్తుంటే ఆయనకు బాధవేస్తోందన్నారు. ముఖ్యమంత్రిగా బాబు రాయలసీమకి 14 ఏళ్లలో ఏం మంచి చేశారో చెప్పాలన్నారు. సిఎం జగన్‌పై ఇలాగే మాట్లాడితే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

బొలికొండ రంగనాథుడికి విశేషాలంకరణ

గుత్తి : మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన శ్రీ బొలికొండ రంగనాథ స్వామి ఆలయంలో స్వామివారిని విశేషంగా అలంకరించారు. కార్తీక్ మాసం చివరి శనివారాన్ని పురస్కరించుకొని అర్చకులు ఆలయంలో అర్చకులు పంచామృత అభిషేకం, కుంకుమార్చన తోపాటు పలు పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివెళ్లి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో దాతలచే అన్నదాన కార్యక్రమం జరిగింది. మహిళా భక్తులు ఆలయం చుట్టు దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో శ్రీ బొలికొండ రంగనాథ స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ వేల్పుల సోమశేఖర్ యాదవ్, కారనిర్వాహణాధికారి వి.దేవదాసు, సిబ్బంది రామకృష్ణ, బాలమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ లీగ్ పోటీలు

బుక్కరాయసముద్రం : ఆర్డీటీ సౌజన్యంతో జిల్లాను నాలుగు గ్రూపులుగా విభజించి జోనల్ లెవెల్‌లో సాఫ్ట్‌బాల్ లీగ్ పోటీలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మొదటి జోన్‌కు బుక్కరాయసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ పోటీలకు కడవకల్లు నార్పల, బుక్కరాయసముద్రం, అనంతపురం, పామిడికి చెందిన వంద మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా ప్రధానోపాధ్యాయులు సుమంగళి, రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈవో వెంకటేషులు, కార్యదర్శి నాగేంద్ర, ఆర్డీటీ గ్రాస్ రూట్ కోఆర్డినేటర్ ఓబులేష్, బుక్కరాయసముద్రం హాస్టల్ వార్డెన్ రాములు నాయక్, వ్యాయామ ఉపాధ్యాయుడు గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు నాగరాజుగౌడ్, పెద్దన్న తదితరులు హాజరయ్యారు.ఈ పోటీలలో బికెఎస్ జెడ్‌పిహెచ్ఎస్ క్లబ్ ప్రథమ స్థానం, కడవకల్లు జెడ్పిహెచ్ఎస్ క్లబ్ ద్వితీయ స్థానం సాధించాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.